# కాగ్ కార్చిచ్చు

బొగ్గు, విద్యుత్తు, ఢిల్లీ విమానాశ్రయాలపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదికలు యూపీఏ-2 ప్రభుత్వాన్ని మరోసారి ఇరుకున పెట్టనున్నాయి. రంజాన్ తర్వాత తిరిగి ప్రారంభమవుతున్న పార్లమెంట్ సమావేశాలు మరింత వేడెక్కనున్నాయి. లక్షా డెబ్భైఆరువేల కోట్ల రూపాయల 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల స్కాంను మించిన బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బయటపెట్టింది. ఇంధన భద్రత, ఆర్థిక వ్యవస్థ సత్వరాభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు సహజ వనరులు కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వ నిర్వాకాన్ని కాగ్ నివేదికలు బట్టబయలు చేశాయి. వేలం పాట లేకుండా బొగ్గు బ్లాకుల కేటాయింపు, అనిల్ అంబానీ విద్యుత్ కేంద్రానికి బొగ్గు నిక్షేపాల కేటాయింపు, న్యూఢిల్లీ విమానాశ్రయ నిర్మాణ కాంట్రాక్టును జీఎంఆర్ సంస్థకు కేటాయించడంలో జరిగిన అవతవకలు కారణంగా ప్రభుత్వ ఖజానాకు మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లు కాగ్ అంచనా వేసింది. ఫెడరల్ ఆడిటర్ (కాగ్) శుక్రవారం సమర్పించిన ఆ మూడు నివేదికలతో పార్లమెంటులో ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశాయి. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రాజీనామా చేయాలని అవి డిమాండ్ చేస్తున్నాయి.

వేలం పద్ధతిని అనుసరించకుండా వివిధ ప్రైవేటు సంస్థలకు 142 బొగ్గు గనులు కేటాయించడంతో 2004-11 మధ్య కాలంలో దేశ ఖజానాకు లక్షా ఎనభైఆరువేల కోట్ల రూపాయల నష్టం జరిగిందని కాగ్ నిగ్గు తేల్చింది. 2006-09 సంవత్సరాల మధ్య బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రధాని మన్మోహన్ సింగ్ స్వీయ పర్యవేక్షణలో ఉండేది. బొగ్గు బ్లాకలను బహిరంగ వేలం ద్వారా కేటాయించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ, న్యాయ వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులు సూచించినప్పటికీ ప్రధాన మంత్రి కార్యాలయం పాత పద్ధతిలోనే కేటాయింపులు జరపిన విషయాన్ని కాగ్ ప్రముఖంగా తప్పుపట్టింది. బొగ్గు గనుల కేటాయింపుల్లో ప్రభుత్వం అనుసరించిన విధాన లోపం వల్ల ఆ నష్టం జరిగిందని మాత్రమే కాగ్ అంచనా వేసింది. ఒక్కొక్క బొగ్గు గనిలో తవ్వకం, వెలికితీతల వ్యయాలు విభిన్నంగా ఉంటాయి, అయితే కాగ్ సగటున అంచనా వేయడం సరికాదని ప్రభుత్వం చెబుతోంది. పార్లమెంట్ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) వాటిని పరిశీలించనంత వరకు కాగ్ నివేదికలు అసంపూర్ణమైనవని ప్రతిపక్షాల విమర్శలను ప్రభుత్వం తోసిపుచ్చింది. గతంలో డిఎంకె పార్టీకి చెందిన టెలికం మంత్రి ఎ.రాజా ఆధ్వర్యంలో స్పెక్ట్రమ్ కుంభకోణం జరగడం వల్ల ప్రధానిని ప్రత్యక్షంగా దోషిగా నిలదీసేందుకు అవకాశం లేకపోయింది. అయితే బొగ్గు కేటాయింపుల విషయంలో అలా తప్పించుకునేందుకు వీలులేదు.

బొగ్గు గనులను వేలం వేస్తే విద్యుత్ ధర పెరిగి ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి ఎస్సార్ పవర్, హిందాల్కో, టాటా స్టీల్, టాటా పవర్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, ఎస్సార్ రిలయన్స్ పవర్ తదితర 25 బడా సంస్థలకు కేంద్రం బొగ్గు నిక్షేపాలను చౌకగా ధారాదత్తం చేసింది. అందువల్ల కేటాయింపుల పద్ధతినే అనుసరించినట్లు ప్రభుత్వం చెబుతోంది. అలాంటిది దేశ విద్యుత్ అవసరాలను తీర్చే సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం జరిగినప్పటికీ ఇంధన కొరత (ప్రధానంగా బొగ్గు) కారణంగా అవి మూలన పడ్డాయి. పర్యవసానంగా దేశంలో తీవ్ర విద్యుత్ సంక్షోభం ఏర్పడింది. రెండు రోజులపాటు విద్యుత్ వ్యవస్థ కుప్పకూలి ఉత్తర భారత్‌లోని ఆరవై కోట్ల మంది ప్రజలు అంధకారంలో గడపగా, కోటాను కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లింది. విద్యుత్ ధర పెరగకుండా ఉండేందుకు ప్రైవేటు కంపెనీలకు బొగ్గు నిక్షేపాలను కేటాయిస్తే గనులనుంచి బొగ్గు ఉత్పత్తి చేయకపోవడం వల్ల ఇంధన కొరతకు దారితీసింది. ఆ కేటాయింపులతో ఖజానాకు వచ్చిన నష్టాలతోపాటు పర్యవసానంగా ఏర్పడిన తీవ్ర ఆర్థిక పరిణామాలకు కూడా ప్రధాని బాధ్యత వహించవలసి ఉంటుంది.

కాగ్ రెండవ నివేదిక న్యూఢిల్లీ విమానాశ్రయ కుంభకోణాన్ని వివరించింది. దేశ రాజధానిలో నాలుగువేల ఎనిమిది వందల ఎకరాల విమానాశ్రయ భూముల్ని 56 ఏళ్ళపాటు దాదాపు ఉచితంగా జీఎంఆర్ సంస్థకు కేంద్రం కట్టబెట్టింది. మూడు దశాబ్దాలపాటు విమానాశ్రయ నిర్వహణకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది. అయితే ఆ ఒప్పందాన్ని జిఎంఆర్ సంస్థకు ఏకపక్షంగా మరో ముప్ఫై ఏళ్ళకు పొడిగించడాన్ని కేంద్రం అనుమతించింది. ఒప్పందానికి భిన్నంగా ఆ సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలను కూడా కాగ్ తప్పు పట్టింది. దీని వల్ల ఖజానాకు ఎనభై తొమ్మిదివేల కోట్ల రూపాయలు నష్టం వస్తోంది. ఇక మూడవ నివేదిక మధ్యప్రదేశ్‌లోని సాసన్ విద్యుత్ కేంద్రం కోసం కేటాయించిన గనుల నుంచి వెలికితీసే బొగ్గును రిలయన్స్ పవర్ సంస్థ మరో లాభదాయకమైన విద్యుత్ ప్లాంటుకు తరలించేందుకు కేంద్రం అనుమతిని ప్రశ్నించింది. దాని వల్ల అనిల్ అంబానీకి ఇరవై తొమ్మిదివేల కోట్ల రూపాయలకు పైగా లబ్ధి చేకూరింది. గత 2జీ కుంభకోణాన్ని కాగ్ నివేదిక బయటపెట్టిన సందర్భంలో పార్లమెంటు సమావేశాలను సుదీర్ఘకాలంపాటు ప్రతిపక్షాలు స్తంభింప చేశాయి. ఇప్పుడు కూడా పార్లమెంటు లోపల, వెలుపలా ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శనలు చేయనున్నాయి. వివిధ హక్కుల సంస్థలు, పౌరసమాజం పార్లమెంటు సమావేశాల సమయంలో ఉద్యమించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

## అభినవ పోతన

తెలంగాణ కవితా కళానందనంలో ఉదయించిన కల్పవృక్షం శ్రీమాన్ వానమామలై వరదాచార్యుల వారు. తెలంగాణ రత్న వీణా తంత్రులపై ఉదయించిన సుమధుర మోహనరాగం. తెలంగాణ సారస్వతఖనిలో వెలసిన మహాకవి జాతిరత్నం. వరదాచార్యులు చరిత్ర ప్రసిద్ధ పట్టణమైన వరంగల్లు మండలాంతర్గమై కవి పండిత కళా విశారదులకు నిలయమైన మడికొండ గ్రామంలో భక్తి జ్ఞాన ప్రతిభా విలసితమైన పండిత వంశంలో శ్రీమతి సీతాంబ, శ్రీమాన్ బక్కయ్య శాస్త్రి పుణ్య దంపతులకు 1912, ఆగస్టు 16న జన్మించారు. తండ్రి బక్కయ్యశాస్త్రి గారు 'బ్రతికి బక్కయ్య



వానమామలై వరదాచార్యులు

శాస్త్రి పురాణము వినవలె' అనే అంతటి ప్రఖ్యాతి వహించిన పరమపౌరాణికులు. బహుశాస్త్ర పారంగతులు. అనేక మధురమంగళ గీతికాకర్తలు. మనోహర నాదవిభూసుర గాత్ర సంపన్నులు. తల్లి సీతాంబ మహాసాధ్వి. భక్తి ప్రపూర్ణ హృదయ వరదాచార్యులు పెద్దన్న శ్రీమాన్ వెంకటాచార్యులు పుంభావభారతులు. రెండవ అన్న శ్రీమాన్ లక్ష్మణాచార్యులు తర్కశాస్త్ర కోవిదులు. బహుభాషా గ్రంథకర్తలు. మూడవ అన్న శ్రీమాన్ జగన్నాథాచార్యులు సంస్కృతాంధ్ర ద్రావిడ భాషావిశారదులు. 'రైతు రామాయణం' మహా కావ్యకర్తలు. వరదాచార్యులు నిజాంకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ విముక్తి మహోద్యమంలో పాల్గొని, నిర్బంధాన్ని పొంది, తాత్కాలికంగా విడుదలయ్యారు. ఆ తరువాత తమ ఇష్టం లేకున్నా, మహారాష్ట్రలోని 'సిరివంచ' గ్రామంలో రెండేళ్లు గడిపి, హైదరాబాద్ విముక్తి కాగానే చెన్నూరుకు చేరారు. ఒకవైపు పోతన చరిత్ర రచనతో మరోవైపు పురాణ హరికథా కాలక్షేపాలతో అలసిపోయిన వరదాచార్యులు క్షయవ్యాధికి గురయ్యారు. మైసూరు వైద్యశాలలో చేరి మూడేళ్లు ఉన్నారు. అప్పటి మైసూరు మహారాణి, హైదరాబాద్ ముఖ్యమంత్రి డా. బూర్గుల రామకృష్ణారావు, తెలంగాణ కవుల రచయితల ఆర్థిక సహకారం వల్ల ఆంధ్రుల అదృష్టవశాన వారికి జరిగిన పదవ ఆపరేషన్ విజయవంతమైంది. ఒక ఊపిరితిత్తి మాత్రం పూర్తిగా ముడుచుకునిపోయింది. 1953లో వారు హైదరాబాద్ వచ్చారు. ఆచార్యుల డిగ్రీలు లేని పాండిత్యాన్ని, దుర్భర దారిద్ర్య జీవితాన్ని గమనించిన బూర్గుల రామకృష్ణారావు నిజామాబాద్ జిల్లా దోమకొండలోని జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులుగా నియమించి మహోపకారం చేశారు. అక్కడ ఏడేళ్లు పనిచేసి, చెన్నూరుకు బదిలీ చేయించుకొని ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా చేరారు. తరువాత 1972లో ఉద్యోగ విరమణ చేశారు. వరదాచార్యులు విధానపరిషత్తు సభ్యులుగా (ఎం.ఎల్.సిగా) తమ బాధ్యతను నిర్వహించారు. వారి షష్టిపూర్తి సందర్భంగా చెన్నూరులో సువర్ణాభిషేకాన్ని, కోరుట్లలో గండపెండేరం, స్వర్ణకంకణం, రత్నాభిషస్త్రకం, కవితా నీరాజనం వంటి అనేక సత్కారాలందుకున్నారు. చెన్నూరులో ఒక వేద పాఠశాలను స్థాపించి, దానికి అధ్యక్షులయ్యారు. 'సాహిత్య గౌతమి' అనే సంస్థను స్థాపించి నడిపారు. కవివతంస, కవిశిరోవతసం, ఉత్ప్రేక్షా చక్రవర్తి, మహాకవి శిరోమణి, అభినవ పోతన, అభినవ కాళిదాసు వంటి బహుబిరుదాలచే సన్మానితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులయ్యారు. కాశీ విశ్వవిద్యాలయం ఆచార్యులను డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టాలనిచ్చి సన్మానించింది. 1968లో వారు 'పోతన చరిత్రము'నకు రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు. అనేక గ్రంథాలను అంకితం పొందారు. బొంబాయిలో, పూనాలో సన్మానాలందుకున్నారు. వారికి సాహిత్య దృష్ట్యా ఆధ్యాత్మికత దృష్ట్యా శతాధికంగా శిష్యులు ఏర్పడ్డారు. చివరిదశలో 1982లో పక్షవాత వ్యాధికి గురై, 26 నెలలు అపస్మారక స్థితిలో ఉండి, చివరకు 1984 అక్టోబర్ 31వ తేదీనాడు పరమపదించారు. ఆంధ్ర సాహితీ గగనంనుంచి ఒక మహోజ్జ్వల తార నేల రాలింది. వరదాచార్యుల 'పోతన చరిత్రము' ఆధునికాంధ్ర మహాకావ్యం, పన్నెండు ఆశ్వాసాలు, దాదాపు నాలుగువేల పద్యాలున్న ఈ ప్రబంధం పద్యగణం చేతనేకాక హృద్యకవితాగుణం చేత కూడా బృహద్గ్రంథమే. వరదాచార్యులను 'అభినవ పోతన'ను చేసింది ఈ గ్రంథమే. అవిశ్రాంతంగా పన్నెండేళ్లు చేసిన ఆచార్యుల కవితా తపస్సు ఈ దివ్య ప్రబంధరూపంలో ఫలించింది. పవిత్ర జీవనుడూ మహాభక్తుడూ మహాకవి అయిన పోతన జీవితగాథను పరమ రమణీయంగా చిత్రించే ఈ కావ్యం ఒక కవితా సుధాకలశం. ఒక్కొక్క పద్యం ఒక్కొక్క అమృత బిందువు. ఈ కావ్యరత్నంలోని ఒక్కొక్క పద్యం ఒక్కొక్క కాంతిరేఖ. వరదాచార్యుల సహజకవితా సౌందర్యమంతా ఈ మహాభవ్యకావ్యదర్పణంలో ప్రతిబింబిస్తున్నది. ఈ కృతి సకలాంధ్ర సహృదయ పుణ్యాకృతి. ఈ కావ్యంలోని మొదటి పది ఆశ్వాసాల్లో పోతన చరిత్రం అభివర్ణితం. చివరి రెండు ఆశ్వాసాల్లో కొన్ని ప్రసిద్ధ భాగవత కథలు అనుబంధంగా చిత్రితం. ఈ అనుబంధం ఈ ప్రబంధానికి దివ్యతాగంధాన్ని పులిమింది. ఒక ఆంధ్ర మహాకవి జీవిత చరిత్రను సమగ్రంగా వర్ణించిన ప్రథమ మహాకావ్యం 'పోతన చరిత్రము'.

– డా. తిరుమల శ్రీనివాసాచార్య

ప్రముఖ కవి

(నేడు 'అభినవ పోతన' శతజయంతి సమాపనోత్సవం)

భరతవాక్యం

భరత్ ఝున్‌ఝున్‌వాలా

## స్విస్ బ్యాంకులపై ఆంక్షలు

నల్ల ధనంపై ప్రభుత్వ శ్వేత పత్రం 'నల్ల' సత్యాలనన్నిటినీ వెల్లడించిందా? కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గత మేలో జారీచేసిన ఆ శ్వేత పత్రం ప్రకారం నల్ల డబ్బు రెండు విధాలుగా ఉత్పత్తి అవుతుంది. అవి: (అ) స్మగ్లింగ్, నేరాలు, అపహరణలు, మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం, అవినీతి మొదలైన చట్టవ్యతిరేక కార్యకలాపాల వల్ల; (ఆ) చట్టబద్ధమైన వాణిజ్య కార్యకలాపాలలో పన్నుల చెల్లింపు ఎగవేత తదితర చర్యల వల్ల. ఒక ఉక్కు కర్మాగారం చట్టబద్ధంగానే ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. అయితే ఇన్‌వాయిస్(అందించిన వస్తు, సేవల వివరాలు, దానికి చెల్లించాల్సిన పైకాన్ని పేర్కొనేది)ను తక్కువ ధరకు సృష్టించవచ్చు లేదా పన్నులను ఎగవేయడానికై కొంత ఉక్కును అక్రమంగా విక్రయించడం మొదలైన చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడవచ్చు.

చట్టవిరుద్ధ కార్యకలాపాల నుంచి ఉత్పన్నమయ్యే నల్ల ధనానికి రెండు మూలాలు ఉన్నాయి. ఒకటి స్మగ్లింగ్, అపహరణలు మొదలైన నేర కార్యకలాపాలు; రెండోది రాజకీయవేత్తల, ప్రభుత్వాధికారుల అవినీతి. ప్రభుత్వ వ్యవస్థలో అవినీతికి ఆధారమవుతున్న వాటిలో మూడు అంశాలను ప్రధానంగా చెప్పాలి. ఒకటి-సహజ వనరుల కేటాయింపు. అడవులు, గనులు, స్పెక్ట్రమ్, నదులు, ప్రభుత్వ భూములు మొదలైన వాటి కేటాయింపులకు ప్రతిగా భారీ సొమ్మును వసూలు చేసుకొంటున్నారు. 'సమగ్ర నియంత్రణలు, స్వతంత్ర నియంత్రణాధికారి రూపేణా నిఘా, ఫిర్యాదుల పరిష్కారానికి లోక్‌పాల్ వ్యవస్థ మొదలైనవి ఈ సమస్యకు పరిష్కారంగా పరిగణించవచ్చని' ప్రభుత్వ శ్వేత పత్రం పేర్కొంది. అవినీతిపరుడైన మంత్రి నియమించే అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా ఎలా నిర్వహిస్తారో నాకు అర్థం కావడం లేదు.

**ద్వితీయ ప్రపంచ యుద్ధకాలం నాటి యూదుల బంగారం ఖాతాల విషయమై అమెరికా వైఖరిని ఆదర్శంగా తీసుకొని భారత ప్రభుత్వమూ మన దేశంలో ఉన్న స్విస్ బ్యాంక్‌లపై ఆంక్షల విధింపునకు పూనుకోవాలి. భారతీయ పౌరులు తమ వద్ద దాచుకున్న నల్ల ధనం వివరాలను వెల్లడించని పక్షంలో లైసెన్స్‌లను రద్దు చేస్తామని స్విస్ బ్యాంక్‌లను హెచ్చరించాలి.**

అవినీతికి రెండో ఆధారం ప్రభుత్వ కొనుగోళ్ళు. బోఫోర్స్ శతఘ్ని వ్యవహారం ఇందుకొక ఉదాహరణ. ప్రభుత్వ పరంగా జరిగే కొనుగోళ్ళు, సేకరణలు పారదర్శకంగా జరిగేందుకు ఒక బిల్లును తీసుకురావడం పట్ల ఆ శ్వేతపత్రం సంతృప్తి వ్యక్తం చేసింది. అటువంటి బిల్లును తీసుకురావడం నిజంగా హర్షణీయమే. అయితే దాని వల్ల అవినీతి అరికట్టబడుతుందని ఆశించడం భ్రమే కాగలదు. నేర విచారణా స్మృతిలోని నిబంధనలతో అవినీతి సమస్యను గట్టిగా ఎదుర్కోవచ్చు. దోషులను పట్టుకొనే బాధ్యత గల పోలీసు అధికారులపై అవినీతిపరులైన రాజకీయ వేత్తలు పెత్తనం చెలాయిస్తుండడం సమస్య పరిష్కారానికి దోహదం చేయడం లేదు.

ఆర్థిక విధానాలలో మార్పులు కూడా అవినీతికి కారణమవుతున్నాయి. తత్ఫలితంగా నల్ల ధనం పెరిగిపోతోంది. ఈ కళలో ఒక ముఖ్యమంత్రి ఆరితేరారు. కొన్ని సరుకులపై అమ్మకపు పన్నును పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేస్తారు. దీంతో వ్యాపారులు వెంటనే ఒక సూట్‌కేసుతో ముఖ్యమంత్రి వద్దకు వెళతారు. వెన్వెంటనే సదరు నోటిఫికేషన్‌ను ఉపసంహరించడం జరుగుతుంది. ప్రభుత్వ అధికారులూ అవినీతికి ఆలవాలమవుతున్నారు. ఈ అంశాన్ని ఆ శ్వేతపత్రంలో పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ రంగంలో వివిధ కార్యక్రమాలు, పథకాల అమలులో నిధుల దుర్వినియోగం బాగా జరుగుతుందని ఆ పత్రం అంగీకరించింది. 1990ల తుదినాళ్లలో గోరఖ్‌పూర్‌లో వరద బాధితుల సహాయ కార్యక్రమాల అమలును నేను నిశితంగా అధ్యయనం చేశాను. బాధితులకు ప్రభుత్వం అందించిన రూ.1000 సహాయానికి సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వడానికి గాను పట్వారీలు ఒక్కొక్కరి నుంచి రూ.200 వసూలు చేసుకున్నారు. ఆ సహాయం మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తే అవినీతి తగ్గుతుందని విజ్ఞులు కొందరు సూచించారు. ఇది సబబైన సూచనే. అయితే ఉన్నతాధికారులు సైతం ఈ అవినీతిలో భాగస్వాములవుతున్నారన్న వాస్తవాన్ని ఆ శ్వేత పత్రం పేర్కొనలేదు. డ్రైవింగ్ లైసెన్సులు జారీచేయడానికి, భూమి రికార్డుల నకళ్లను ఇవ్వడానికి క్రిందిస్థాయి అధికారులు తీసుకొనే ముడుపులలో ఉన్నతాధికారులకు విధిగా వాటా ఇవ్వవలసివుంటుంది. అధికారులు తాము కోరుకున్న ప్రదేశాలలో పోస్టింగ్ పొందడానికి రాజకీయవేత్తలకు విధిగా ముడుపులు చెల్లించవలసివుంటుంది. ఇలా రాజకీయవేత్తలు నల్ల ధనాన్ని మూటగట్టుకుంటున్నారు. అయినా అవినీతిలో రాజకీయ వేత్తల భాగస్వామ్యం గురించి ఆ శ్వేత పత్రం మౌనంగా ఉండిపోయింది.

విదేశాలలో దాచుకున్న నల్ల ధనాన్ని వెనక్కి తీసుకురావడానికి ఆయా దేశాల చట్టాలలోని గోప్యతా నిబంధనలు అడ్డుగా ఉన్నాయని ప్రభుత్వ శ్వేతపత్రంపేర్కొంది. ఆ నిబంధనలను అధిగమించడంలో తన నిస్సహాయతను కూడా వ్యక్తం చేసింది. ఇది ఆలోచించాల్సిన అంశం. 1990ల్లో అమెరికన్ యూదులు నాజీల కాలపు బంగారం ఖాతాల వ్యవహారాన్ని లేవనెత్తారు. ద్వితీయ ప్రపంచ యుద్ధానికి ముందు, యుద్ధ కాలంలోనూ చాలా మంది యూదులు తమ బంగారాన్ని, డబ్బును స్విస్ బ్యాంకుల్లో డిపాజిట్ చేశారు. అయితే ఆ బంగారం, డబ్బును తిరిగి తీసుకోకముందే నాజీల ఘాతుకాలకు వారు బలయ్యారు. ఆ బంగారం, డబ్బు తమకు అనుకోని లాభాలుగా స్విస్ బ్యాంకులు పరిగణించాయి. తామేమీ తప్పుచేయలేదని, యుద్ధమనంతరం వివిధ కమిషన్లు ఆ బంగారం, డబ్బు సమస్యను పరిష్కరించాయని స్విస్ బ్యాంకర్లు స్పష్టం చేశారు. అయితే అమెరికా కాంగ్రెస్ ఎగువ సభ సెనేట్ బ్యాంకింగ్ కమిటీ చైర్మన్ సెనేటర్ అల్ఫొన్సో డి 'ఎమటో వారితో ఏకీభవించలేదు. అమెరికాలో స్విస్ బ్యాంకుల లైసెన్స్‌లను రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. 1997 సంవత్సరాంతంలో న్యూయార్క్ నగర పాలనా వ్యవస్థ అయితే యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌పై అనేక ఆంక్షలు విధించింది. దీంతో స్విస్ బ్యాంకులు దిగివచ్చి 100 కోట్ల డాలర్లకు పైగా నష్ట పరిహారాన్ని చెల్లించడానికి అంగీకరించాయి. ఇదే విధంగా భారత ప్రభుత్వమూ మన దేశంలో ఉన్న స్విస్ బ్యాంక్‌లపై ఆంక్షల విధింపునకు పూనుకోవాలి. భారతీయ పౌరులు తమ వద్ద దాచుకున్న నల్ల ధనం వివరాలను వెల్లడించని పక్షంలో వాటి లైసెన్స్‌లను రద్దు చేస్తామని స్విస్ బ్యాంక్‌లను హెచ్చరించాలి.

వ్యాపార సంస్థలు పన్నుల చెల్లింపును ఎగవేయడం వల్లే నల్ల ధనం పెరిగిపోతుందని ప్రజలు విశ్వసించేలా చేయడమే ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీచేసిన ఆ శ్వేతపత్రం అసలు లక్ష్యమని చెప్పక తప్పదు. అవినీతిపరులైన రాజకీయవేత్తలు ప్రజల ఆగ్రహానికి గురికాకుండా చేసేందుకే ఈ అప్రకటిత లక్ష్యం. నల్ల ధనం సమస్యకు సరైన పరిష్కారం నిజాయితీపరులైన వారిని మంత్రులుగా నియమించడమే. ఇది సాధ్యమేనా? ఎందుకంటే మంత్రులను నియమించే వారు సైతం ఆ కళంకానికి అతీతంగా లేరు కదా!

(ఆంధ్రజ్యోతికి ప్రత్యేకం)

## వలసలపై వక్రీకరణల వికృతం

**బెంగాలీ మాట్లాడే ముస్లింల వలస సమస్య పరిష్కారం కానంతవరకు అసోం మండుతూనే ఉంటుంది. బంగ్లా దేశీయులు, బెంగాలీ మాట్లాడే ముస్లింలే కాక హిందీ మాట్లాడే బీహారీలూ, రాజస్థాన్ మార్వారీలూ అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలోనే వలస వచ్చారు... 2003లో కేంద్ర ప్రభుత్వం బోడోలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దైనా చేయాలి లేదా బిటిసిలో బోడోయేతరులకు మరింత భాగస్వామ్యాన్ని అయినా కల్పించాలి. బెంగాలీ ముస్లింల వలసల గురించి అతిశయోక్తులతో జరుగుతున్న ప్రచారాన్ని నిలిపివేయాలి.**

దిగువ అసోంలోని కోక్రఝార్, మరో మూడు జిల్లాల్లో చోటు చేసుకున్న దురంతాల గురించి వార్తా పత్రికల్లో ఇప్పటికే చాలా రాశారు. జూలై 6 నుంచి ఇంతవరకు దాదాపు అరవై మంది చనిపోయారు (ప్రధాన ఘర్షణలన్నీ జూలై 19 నుంచి సంభవించాయి). ఆ నాలుగు జిల్లాల్లో ఇప్పటికీ తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనివున్నాయి. దాదాపు నాలుగు లక్షల మంది శరణార్థులు వేర్వేరు ప్రదేశాలలోని 27 సహాయ శిబిరాలలో తలదాచుకొంటున్నారు. వీరిలో మూడు లక్షల మంది ముస్లింలు. వార్తా పత్రికలు సంఘటనలను వివరిస్తాయే గానీ, నిశితంగా విశ్లేషించవు; సమగ్ర, లోతైన అధ్యయనం ఆధారంగా ఆ సంఘటనలకు కారణాలను వెల్లడించవు.

కోక్రఝార్, 'బోడో ప్రాదేశిక మండలి' (బిటిసి) ఆధ్వర్యంలోని ఇతర జిల్లాల్లో బోడోలు, ముస్లింల మధ్య చోటుచేసుకున్న దాడుల కంటే ఆ సంఘర్షణ చాలా విస్తృతమైనది. అసోం మతతత్వ అల్లర్లు ఆ సంఘర్షణకు ఒక వ్యక్తీకరణం మాత్రమే. బంగ్లాదేశీ ముస్లింల వలసల గురించి తప్పుడు ప్రచారాన్ని అరికట్టని పక్షంలో అసోంలో సుస్థిర శాంతి నెలకొనే అవకాశం లేదు. అస్సామీ భాషా సంస్కృతుల పరిరక్షణకై 1980ల్లో అసోం విద్యార్థుల ఉద్యమం ప్రజ్వరిల్లింది. అదే కాలం(1983)లో నెల్లి ఊచకోతలు సంభవించాయి. నెల్లిలో బెంగాలీ మాట్లాడే ముస్లింలు (వీరినే బంగ్లాదేశీలు అంటారు), లాలంగ్ తెగ ప్రజల మధ్య అల్లర్లు చెలరేగాయి. వాటిలో 3000 మంది ముస్లింలు హతమయ్యారు. దీని వల్ల అస్సామీ మాట్లాడే ముస్లిం లు కూడా తీవ్ర భయ భ్రాంతులకు గురయ్యారు. నెల్లి ఊచకోతలపై విచారణకు నేను అక్కడకు వెళ్ళినప్పుడు అస్సామీ ముస్లింలెవరూ వాటి గురించి మాట్లాడడానికి సుముఖత చూపలేదు.

2008లో కూడా అక్కడ ముస్లింలు, బోడోల మధ్య ఘర్షణలు జరిగాయి; 55 మంది హతమయ్యారు. బంగ్లాదేశీ ముస్లింలుగా పిలవబడే ఈ ముస్లింలందరూ వాస్తవానికి బ్రిటిష్ పాలకుల హయాంలో అక్కడకు వలస వెళ్ళినవారే. తాము 1930ల తొలినాళ్లలోను, అంతకంటే ముందే వలసవచ్చామని నెల్లి బెంగాలీ ముస్లింలు నాకు చెప్పారు. భూముల సాగుకు తమను తీసుకొచ్చారని వారు పేర్కొన్నారు. ఈ ముస్లింలంతా కష్టపడి పనిచేసేవారు. అస్సామీ అహోమ్‌లు, లాలంగ్ కొండతెగ ప్రజల్లో కష్టపడే స్వభావం తక్కువ. నెల్లి హత్యాకాండను దేశం మరచిపోయింది. అసలు అక్కడ ఏమీ జరగనట్టుగా ఆ ఊచకోతలపై కనీసం విచారణకైనా ప్రభుత్వం ఆదేశించ లేదు. బంగ్లాదేశీ ముస్లింలు పెద్ద ఎత్తున అసోంకు వలసవస్తున్నారని భారతీయ జనతా పార్టీ ప్రచారం చేస్తోంది. ఎటువంటి ఆధారాలు చూపకుండానే, అలా వలసవచ్చిన వారి సంఖ్య లక్షల్లో ఉన్నట్టు బిజెపి చెబుతోంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అసోంలో 1980ల నుంచి చురుగ్గా ఉంటోంది. శంకర్ దేవ్, అజాన్ ఫకీర్ లాంటి కవి-సాధువుల కృషి ఫలితంగా అసోంలో శతాబ్దాల నుంచి హిందువుల-ముస్లింల మధ్య పూర్తి సామరస్యం విలసిల్లుతోంది. ఇప్పుడు ఈ రెండు మతాల వారి మధ్య విభేదాలు సృష్టించడానికి, వాటిని మరింతగా తీవ్రం చేయడానికి ఆరెస్సెస్ పలు విధాలా ప్రయత్నిస్తోంది. హిందువుల, ముస్లింల మధ్య సామరస్యం ఉండడం బిజెపి హిందుత్వ రాజకీయాల పురోగతికి దోహదం చేయదు. కనుక బంగ్లాదేశీ ముస్లింల పేరిట ఆ సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి హిందుత్వ శక్తులు పూనుకున్నాయి. అసోంలో బెంగాలీ మాట్లాడే ముస్లింలు ఉన్న మాట వాస్తవం. ఇటీవలి కాలంలో కూడా బంగ్లాదేశ్ నుంచి, పశ్చిమ బెంగాల్ నుంచి కొద్ది మంది బెంగాలీ ముస్లింలు అసోంకు వలస వచ్చిన మాట నిజం.

అయితే అసోంలోని బెంగాలీ ముస్లింలలో అత్యధికులు బ్రిటిష్ పాలకుల హయాంలో వచ్చిన వారే. ఇటీవలి కాలంలో వలసవచ్చిన వారు ఖచ్చితంగా ఎంత మంది ఉంటారన్న విషయమై శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించిన గణాంకాలేవీ లేవు. వలసవచ్చే వారి వివరాలు ఖచ్చితంగా నమోదుచేసే వ్యవస్థ కూడా లేదు. అర్ధ సత్యాల ఆధారంగా జరుగుతున్న ప్రచారంవల్ల రెండు మతవర్గాల వారి మధ్య అయోమయం, అనుమానాలు నెలకొంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ, దాని ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలు బంగ్లాదేశీ ముస్లింల వలసలను అనుమతిస్తున్నాయని, వారిని ఓటు బ్యాంకుగా వాడుకొంటున్నారనే ప్రచారం కాంగ్రెస్‌ను వ్యతిరేకించే ప్రజలను సహజంగానే ఆకట్టుకొంటోంది. ఈ వలసల సమస్య పరిష్కారం కానంతవరకు అసోం మండుతూనే ఉంటుంది. సుస్థిర శాంతి నెలకొనడం అసాధ్యం. బంగ్లాదేశీయులు, బెంగాలీ మాట్లాడే ముస్లింలే కాక హిందీ మాట్లాడే బీహారీలు, రాజస్థాన్ మార్వారీలు కూడా అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలోనే వలస వచ్చారు. ఈశాన్య రాష్ట్రాలలోని చాలా ప్రాంతాల్లో వ్యాపార వాణిజ్యాలపై ఇలా వలస వచ్చిన వారి నియంత్రణ గణనీయంగా ఉంది. అయితే కొన్ని రాజకీయ ప్రయోజనాల కోసం అసోంకు బంగ్లాదేశీ ముస్లింలు మాత్రమే వలస వచ్చారని, ఇంకా వస్తున్నారనే ప్రచారం నిరంతరంగా కొనసాగుతోంది.

బోడోలు కేవలం 29 శాతం మంది మాత్రమే ఉన్న జిల్లాల్లో బోడో ప్రాదేశిక మండలిని సృష్టించడం కూడా ఈ సంఘర్షణకు మరో కారణం. బ్రిటిష్ ఆధ్వర్యంలోని జిల్లాల్లో బెంగాలీ మాట్లాడే ముస్లింల బ్రిటిష్ వారి కాలం నుంచీ పెద్ద సంఖ్యలో ఉన్నారు. బోడో రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న మిలిటెంట్ బోడో సంస్థలను సంతృప్తిపరచేందుకే కేంద్ర ప్రభుత్వం కోక్రఝార్, మరో మూడు జిల్లాల్లో బిటిసిని సృష్టించింది. బోడోలు కేవలం 29 శాతం మంది మాత్రమే ఉన్న జిల్లాల్లో బోడో ప్రాదేశిక మండలిని ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబు? బోడోయేతర ప్రజలు బిటిసి పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పాలనకు సంబంధించిన అన్ని అంశాల పైన ఆ సంస్థకు పూర్తి అధికారాల నివ్వడం సహజంగానే వారిలో ఆగ్రహావేశాలను కల్గిస్తుంది. కాగా బిటిసిలోని జిల్లాల్లో తమ జనాభాను పెంచుకోవడానికి బోడోలు ప్రయత్నిస్తున్నారు. తద్వారా బిటిసి ఏర్పాటు న్యాయబద్ధమేనని వారు నిరూపించదలచుకున్నారు.

మిలిటెంట్ బోడోలు ప్రభుత్వానికి తమ ఆయుధాలను అప్పగించినట్టుగా చెబుతున్నారు. వాస్తవానికి అలా జరగలేదు. ఆ మిలిటెంట్లు ఇప్పటికీ తమ ఆయుధాలతో స్వేచ్ఛగా సంచరిస్తున్నారు. రాజకీయ కారణాల మూలంగా ఈ బోడోలను నిరాయుధులను చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించడం లేదు. ముఖ్యమంత్రి తరుణ్ గోగోయ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో బోడో నేషనల్ ఫ్రంట్ కూడా భాగస్వామి. దీంతో బోడోలకు అసంతృప్తి కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవడం లేదు. ఇంతకూ జూలై 6న కోక్రఝార్‌లో ఏమి జరిగింది? నలుగురు బోడో యువకులు మోటార్ సైకిళ్ళపై వచ్చి ఇద్దరు ముస్లింలను కాల్చి చంపి పరారయ్యారు. ఈ సంఘటనపై జిల్లా అధికార యంత్రాంగం ప్రతిస్పందించలేదు. జిల్లా ఉన్నతాధికారులిరువురూ బోడోలే కావడం గమనార్హం. దరిమిలా గుర్తు తెలియని వ్యక్తులు (వీరిని బెంగాలీ ముస్లింలుగా భావిస్తున్నారు) నలుగురు మాజీ బోడో మిలిటెంట్లను హతమార్చారు. దీంతో కోక్రఝార్ అగ్నిగుండమై పోయింది. డిప్యూటీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను తొలగించారు (జిల్లా కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు).

జిల్లా ఉన్నతాధికారులపై ఈ చర్యను సకాలంలో తీసుకొనివున్నట్టయితే రక్తపాతాన్ని నివారించడం సాధ్యమై ఉండేది. అయితే ముఖ్యమంత్రి కఠిన చర్య తీసుకోకుండా, మౌన ప్రేక్షకుడిగా ఉండిపోయారు. అయితే అల్లర్లు పెచ్చరిల్లిన తరువాత సైన్యాన్ని పంపించాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి గోగోయ్ కోరారు. అయితే అప్పటికే ఆలస్యమైంది. పరిస్థితి అదుపు తప్పింది. అల్లర్లకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్య తీసుకోవాలని ముఖ్యమంత్రిని ప్రధాని మన్మోహన్ ఆదేశించారు. అల్లర్లు, హత్యాకాండ జరిగిన ప్రదేశాలను ముఖ్యమంత్రి సందర్శించకపోయినప్పటికీ ప్రధాని సందర్శించారు. అసోంలో గానీ, ఆ మాటకొస్తే కోక్రఝార్‌లోగానీ అల్లర్లు సంభవించడం ఇదే మొదటిసారి కాదు. చివరిసారీ కాబోదు. ఇప్పటికైనా సరైన చర్యలు చేపట్టకపోతే మరింత విధ్వంసం జరిగే అవకాశమెంతైనా ఉంది. తక్షణమే చేపట్టవలసిన చర్య బోడో యువకులను నిరాయుధలను చేయడం. అల్లర్ల ప్రాంతాల్లో బోడో యువకులు ఆయుధాలతో స్వేచ్ఛగా తిరుగుతూ బోడోయేతరులను ముఖ్యంగా ముస్లింలను బెదిరిస్తున్నారు. బోడోయేతరుల నుంచి డబ్బును కూడా డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వని పక్షంలో వారి పశువులు, కోళ్లను తీసుకువెళుతున్నారు. ఈ చర్యలు ఆ ప్రాం తాల్లో ప్రజలను తీవ్ర చికాకుకు గురిచేస్తున్నాయి. ఈ దృష్ట్యా బోడో యువకుల నుంచి ఆయుధాలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలి. మరి బోడోల రాజకీయపార్టీ ప్రభుత్వంలో భాగస్వామి కనుక ఈ చర్య చేపడతారా అనేది అనుమానమే. ఏదిఏమైనా శాంతినెలకొనాలంటే బోడో యువకులను నిరాయుధులను చేసి తీరాలి. బోడో ప్రాదేశిక మండలి ఏర్పాటుతో నెలకొన్న సమస్యలకు ఒక పరిష్కారాన్ని కనుగొనాలి. బోడోలు మూడోవంతు మంది మాత్రమే ఉన్న ప్రాంతాల్లో బోడోలకు మాత్రమే అధికారం అప్పగించడం ఎంతవరకు సమంజసం? బోడోయేతర వర్గాల వారి ప్రయోజనాలను విస్మరించి మైనారిటీ వర్గమైన బోడోలకు సకల అధికారాలను కల్పించడం తప్పు. కేంద్ర ప్రభుత్వం ఈ తప్పును గుర్తించి సవరించుకోవాలి. బిటిసి ప్రాంతాల్లో ముస్లింలే కాక కూచ్ రాజ్ బొంగాసీస్, సంతాల్‌లు, ఆదిబాషీస్ మొదలైన వారు ఉన్నారు. బోడోయేతర ప్రజల్లో ముస్లింలే అత్యధికులు. 2003లో కేంద్ర ప్రభుత్వం బోడోలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దైనా చేయాలి లేదా బిటిసిలో బోడోయేతరులకు మరింత భాగస్వామ్యాన్ని అయినా కల్పించాలి. ప్రభుత్వం చేపట్టవలసిన మరో ముఖ్యమైన చర్య బెంగాలీ ముస్లింల వలసల గురించి అతిశయోక్తులతో జరుగుతున్న ప్రచారాన్ని నిలిపివేయడం. బెంగాలీ ముస్లింలకు సంబంధించిన వాస్తవాలన్నిటినీ దేశ ప్రజలకు నివేదించాలి. ఈ వలసలపై జరుగుతోన్న ప్రచారాలు అసోం ప్రజలనే కాక యావత్ దేశ ప్రజలనూ చికాకు పరుస్తున్నాయి. అసోంలో శాంతి నెలకొనాలంటే ప్రభుత్వం తక్షణమే చేపట్టవలసిన చర్యలలో ఇవి కొన్ని మాత్రమే. అసోం సమస్యను శాంతిభద్రతల సమస్యగా కాక రాజకీయ సమస్యగా పరిగణించి రాజకీయ పరిష్కారాన్ని కనుగొనాలి. బోడో నాయకులు కొంతమంది బాధ్యతారహితమైన ప్రకటనలు చేయడం ఎంతైనా గర్హనీయం. అక్రమ వలసకారులనే నెపంతో పొరుగుదేశమైన బర్మాలో సైతం (ఆ దేశంలో సైనిక ప్రభుత్వం ఉన్నదనేది గమనార్హం) రోహింగ్యా ముస్లింలు ఊచకోతకు గురికావడం చాలా శోచనీయం. ప్రజాస్వామ్య పాలన ఉన్న మనదేశంలోనూ బెంగాలీ ముస్లింలు ఊచకోతలకు గురవుతున్నారు. అయితే మన ప్రభుత్వం ముఖ్యంగా ప్రధాని మన్మోహన్ ఈ అల్లర్లను ఆపడానికి కఠిన వైఖరి అవలంబించారు. బాధితులకు రూ.300 కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించారు. బర్మాలోని సైనిక ప్రభుత్వం రోహింగ్యా ముస్లింలను నిర్దయగా హతమారుస్తూ తన చర్యలను సమర్థించుకొంటోంది. వలసలను పూర్తిగా ఆపడం అసాధ్యం. అయితే వలసలపై అతిశయోక్తులతో కూడిన ప్రచారం చేస్తూ వాటిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడాన్ని అరికట్టాలి. అసోంలో శాంతిని నెలకొల్పడానికి పాలకులు రాజకీయ విజ్ఞత చూపాలి.

– డాక్టర్ అస్గర్ అలీ ఇంజినీర్

సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం ముంబై

## అశాస్త్రీయ వాదనలతో చిక్కులు

**అసలు మొత్తం గోదావరి పరివాహకంలో ఆంధ్రప్రదేశ్ వాటా కేవలం 23.8 శాతం మాత్రమే. పోలవరం వద్ద వచ్చే ప్రవాహం చూస్తే ముఖ్య గోదావరి కంటే ప్రాణహిత, ఇంద్రావతి శబరి (కోలాబ్) ఉప నదుల నుంచి సమకూరే జలాలే దాదాపు 80 శాతం. అవన్నీ గోదావరి ఉత్తర ప్రాంతం నుంచే వస్తున్నాయని, తెలంగాణ జిల్లాల నుంచి సమకూరే నీరు పోలవరం ప్రాజెక్టుకి సాధారణంగా అవసరమే లేదని జ్ఞప్తికి తెచ్చుకోవాలి.**

ఈమధ్య కొందరు నాయకులు పోలవరం కట్టేది కేవలం తెలంగాణను ముంచటానికని, ఆ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ఎండిపోతుందని, చేస్తున్న ప్రకటనలు, కొందరి వ్యాసాలు వాస్తవానికి చాలా దూరంగా, ప్రజల మధ్యన విద్వేషాలు పెంచే విధంగా ఉన్నాయి. పోలవరం పరిసరాలలో ప్రాజెక్టు కట్టాలనే ఆకాంక్ష ఎప్పటినుంచో ఉన్నది. 1941లోనే 6.5 కోట్ల రూపాయలతో ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 1944 కల్లా రిపోర్టులు పూర్తయ్యాయి. ప్రపంచంలోనే సివిల్ ఇంజనీరింగ్ రంగాలలో మేటి అయిన డా.సావాజ్ (డిజైన్స్-రష్యా), డా. టెర్గాసి(జియాలజి-హార్వర్డ్), సర్ డొనాల్డ్ (లండన్), హర్పర్ (అమెరికా) సహకారంతో పోలవరం ఫైనల్ అయి ఒక అత్యుత్తమ ప్రాజెక్టుగా అభివర్ణింపబడింది. అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ వేవల్ అంగీకారం మేరకు మద్రాసు, బ్రిటీష్ రక్షిత స్టేట్ అయిన హైదరాబాద్ మంత్రివర్యులు అయిన భక్తవత్సలం, మీర్జా ఇస్మాయిల్‌ల అనుమతి పొందింది. ఇంతలో స్వాతంత్ర్యం రావడంతో ఇతర కారణాల వల్ల ఆ ప్రాజెక్టు అమలు ఆలస్యం అయింది. 1959లో గుల్హాటి కమిషన్ కూడా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించింది. 1980 కల్లా మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలతో ఈ ప్రాజెక్టుని ఇప్పటి ఎత్తుతోనే కట్టడానికి ఆంధ్రప్రదేశ్ అంగీకారానికి రావడం కూడా జరిగింది. పోలవరం ప్రాజెక్టుకి 1981 మే నెలలోనే అప్పటి ముఖ్యమంత్రి తెలంగాణ ముద్దుబిడ్డ టంగుటూరి అంజయ్య ఏకంగా పునాది రాయివేసారు. యన్.టి.ఆర్ మరల పేరు మార్చి కట్టే ప్రయత్నం చేసారు. అయినా ఏ రోజూ ఏ ఒక్క తెలంగాణ నాయకుడూ మొన్నటి వరకూ అడ్డుచెప్పలేదు.

ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం గోదావరిపై తెలంగాణలో నీటి నిలువ కోసం ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదని, కోస్తానే అభివృద్ధి అయిందనటం వాస్తవం కాదు. గోదావరి జలాలపై తెలంగాణలో నీటిని నిలువచేసే శ్రీరాంసాగర్ లాంటి (సామర్థ్యం 112 టి.యం.సి) భారీ ప్రాజెక్టులే కాక మానేరు (సామర్థ్యం 24.07 టి.యం.సి), సింగూరు (29.9), కడెం (7.6) సహా అనేక చిన్నవి కూడా వేలాది కోట్లతో నిర్మాణమయ్యాయి. కోస్తాలో ధవళేశ్వరం బరాజ్ ఆధునికీకరణ మాత్రం జరిగింది. అయినా దేశానికి శతాబ్దంపైగా ఆహారాన్ని అందించిన గోదావరి డెల్టాకి కాటన్‌నాటి చిన్న నీటి మళ్ళింపు బ్యారేజ్ (సామర్థ్యం కేవలం 2.93 టి.యం.సి) తప్ప కనీసం ఒక్క బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కూడా ఈ 56 సంవత్సరాలలో నిర్లక్ష్యంతో కట్టలేదు. ఆ చిన్న అడ్డుకట్ట దాటిన లక్షలాది క్యూసెక్కుల ప్రవాహం, వేలాది టి.యం.సిలు శిశువుకి దక్కని స్తన్యంలా ఉప్పుసముద్రం పాలౌతుందనేది తెలుగు ప్రజలందరూ అర్థం చేసుకునే రోజు రాక తప్పదు. ఆ రోజున ప్రాజెక్టుకు కేవలం తెలంగాణ పేరు చెప్పి అనాలోచితంగా అడ్డుపడేవారి అవకాశవాదం బట్టబయలౌతుంది. పోలవరం ముంపునకు తెలంగాణ ఉద్యమానికి ముడిపెట్టడం సరైనది కాదు. అసలు ముంపునకు గురౌతున్న వాటిల్లో గోదావరికి దిగువ నైరుతి ప్రాంతం మాత్రమే తెలంగాణకి సంబంధించినది. దాదాపుగా అక్కడి గిరిజ నేతరులందరూ, అనేక మంది గిరిజనులు అంగీకారం తెలియజేసారని తెలుస్తుంది. అయితే అత్యధికంగా ముంపునకు గురౌతున్నది గోదావరికి ఉత్తరాన ఉన్న ఒకనాటి తూర్పుగోదావరి జిల్లాకి చెంది కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం తాత్కాలికంగా ఖమ్మంకి కలిపిన ప్రాంతమే! 1956 నాటి ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ రాష్ట్రాల సరిహద్దుల ప్రాతిపదికనే మరిచి అది తెలంగాణ రాష్ట్రానికి కలపాలనే వాదన వస్తే, నల్గొండ జిల్లాని కోస్తాకి కలపాలనే వాదనని కూడా అంగీకరించినట్లే కదా? నిజంగా విభజన కోరుకునే వారు విద్వేషాలని పెంచాలని చూడరు.

1921 నుంచి నిజాంసాగర్ నిర్మాణంలో 13,500 మంది, 1964 నుంచి శ్రీరాంసాగర్‌లో లక్షమందికి పైగా నిర్వాసితులయ్యారు. అలాగే లోయర్ మానేరు డ్యాం వల్ల 13 వేల కుటుంబాలు, నాగార్జునసాగర్ (1956 నుంచి) వల్ల 6 వేల కుటుంబాలు, శ్రీశైలం (1976-81) వల్ల 22 వేల కుటుంబాలు నిర్వాసితమయ్యాయి. నాగార్జునసాగర్, శ్రీశైలం వల్ల నిరాశ్రయులైన చెంచులు అన్యాయమైపోయారు. పోలవరంలో మొత్తం నిర్వాసితులలో గిరిజనులు 50 శాతం పైగా ఉంటారు. దేశంలో కొన్ని ఇతర ప్రాజెక్టులు పరిశీలిస్తే కర్జాన్ (దాదాపు 100శాతం), సర్దార్ సరోవర్ (57.6 శాతం), మనేశ్వర్ (60 శాతం) వరకూ గిరిజన నిర్వాసితులు ఉన్నారు. అసలు మన ప్రజలందరూ ఆందోళన చెందాల్సింది ముఖ్యంగా నిర్వాసితులౌతున్న గిరిజనుల గురించి, డ్యాం రక్షణ గురించి మాత్రమే. మన రాష్ట్రంలో భూమి పుత్రులైన కొండ/గిరిజన 31 జాతులు 5 శాతం రిజర్వేషన్లు పొందుతుంటే కొత్తగా వచ్చిన 2 జాతుల వారు 95 శాతం పొందుతున్నారని తమ అస్తిత్వం కాపాడుకోవడానికి జీవన్మరణ సమస్యగా ఆ గిరిజనులు చేస్తున్న ఆందోళన చూస్తున్నాం. మరల నేడు ముఖ్యంగా ఆ జాతుల వారే ముంపునకు గురౌతున్నారు. వీరి సహచర జాతులే పక్కనున్న అవిభక్త తెలుగు బస్తర్ జిల్లాలో ఖాకీల, పెట్టుబడిదారుల దమననీతికి బలౌతున్నారు. ఈ రాష్ట్రంలో అసలు గిరిజనులు తమ సంస్కృతి, భాషలు కోల్పోతున్నారు; ప్రాజెక్టుల వల్ల స్వస్థలాలనుంచి స్థానభ్రంశమవుతున్నారు; వారి అటవీ వనరులను, గనులను నాగరిక సమాజ అభివృద్ధి పేరిట మైదాన ప్రాంతాల వారు దోచుకుపోతున్నారు. వీటితో పాటు చెంచులు మొదలైన జాతుల జనాభా ఏకంగా తగ్గిపోతోంది; గిరిజనులు నిజంగా ఉద్యోగాలను కోల్పోతున్నారు; వారి నిధుల దోపిడీ జరుగుతోంది. ఇవన్నీ చూస్తున్నప్పుడు, తమకొక ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఆకాంక్ష వ్యక్తపరుస్తూ ఆత్మగౌరవం కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఉద్యమిస్తోన్న మన్యసీమ వారికి ఒక రాష్ట్రం ఏర్పడాల్సిందే కదా. వీరి వాదనకి అందుకనే కమిటీలు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. మన్యసీమ ప్రత్యేక రాష్ట్ర వాదనకు, స్వయం పాలన కోసం మద్దతు ఇచ్చిన తరువాతనే ఇతర భాషల వారు యాసలో తేడా కోసం, కొన్ని ఉద్యోగాలు, తమ నాయకుల ఆత్మగౌరవం, పదవులు, సెంటిమెంట్/స్వయం పాలన కోసం ప్రత్యేక రాష్ట్రం అడగటం ఆలోచించాలని అసలైన గిరిజన నేతలతో పాటు సామాజిక మార్పు కోసం తపిస్తున్న డా. కంచ ఐలయ్య, బొజ్జా తారకం వంటి వారు ఘోషిస్తున్నారు. పోలవరం వ్యతిరేకత పేరుచెప్పి రాజకీయం చేసేవారికి నిజాయితీగా గిరిజనులపై ప్రేమ ఉంటే ముందు వారి మన్యసీమ రాష్ట్రాన్ని వారికిచ్చి మానవహక్కులను కాపాడాలి. తాను ఒకే భాష పెద్దన్న నుంచి విడిపోవాలి కాని తన బంధువు మాత్రం వేరుపడకుండా తన పెత్తందారీ తనంలోనే ఎల్లప్పుడూ ఉండాలని ఎవరైనా అంటే అంతకంటే మోసం ఉండదు. దీనిపై సామాజికవేత్తలు దృష్టిపెట్టాలి. దేశంలో మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే పోలవరం ప్రస్తుత అంచనాల ప్రకారం నిర్వాసితుల కోసం ఖర్చుపెట్టబోతున్న దాదాపు రూ.4,500 కోట్ల కేటాయింపు ఎక్కువే. కానీ ముంపుకు గురౌతున్న గిరిజనులకు నష్టపరిహారం, మైదాన ప్రాంతాలలో ఏర్పరుస్తామంటున్న ఆవాసం పరిష్కారం కానేరదు. వారిలో కోరుకున్న వారి పిల్లలకు చదువు, సౌకర్యాలతో పాటు గిరిజన సంస్కృతిలోనే ఉండాలనుకునేవారికి చట్టం సవరించి అయినా, ముంపునకు గురవని పై కాంటూర్‌లలో ఆవాసం ఏర్పరచాలి; ఆ పోలవరం తటాకంలో భారీ ఆదాయం వచ్చే మత్స్య సంపదలో ముఖ్యమైన వాటా ఇవ్వాలి. ఇటువంటి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ఈ ప్రాజెక్టు అత్యుత్తమమని చెప్పవచ్చు.

అంతర్జాతీయ సమాజం లోయర్ రైపేరియన్ హక్కులను గుర్తించింది. పైగా ఉప్పునీటి ప్రభావం పెరుగుతున్న సముద్ర తీర ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత సహజంగానే ఇవ్వాలి. అది ఆలోచించకుండా అసలు పరివాహక నీరు లభించే ప్రాంతం ఆధారంగా నీరు చుక్కకి లెక్కవేసుకుంటూ పంచాలంటే దేశంలో అనేక ప్రాంతాలు ఘోరంగా నష్టపోతాయి. ఆ వాదనల ప్రకారం కేవలం 12 శాతం ఉండే పశ్చిమ కనుమలలో 50 శాతం పైగా కృష్ణా నదీ జలాలు లభిస్తుంటే కేవలం 400 టి.యం.సిల పైబడి మాత్రమే నీరు లభ్యమయ్యే లోయర్ రైపేరియన్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు 1000 టి.యం.సిల కె.డబ్ల్యు.డి.టి. కేటాయించడం తప్పు అవుతుంది కదా. అలాగే శ్రీరాంసాగర్‌లో దాదాపు 90శాతం వచ్చే నీరంతా పై రాష్ట్రాల నుంచే కాబట్టి వారే వాడుకుని తెలంగాణకి చుక్కరాకుండా చేయాలనే వాదనలు చాలా దుర్మార్గమైనవి. ఇలాంటి వాదనలు చేస్తే ఉత్తరోత్తరా ప్రతీ జిల్లా, మండలానికి తగువులు, ద్వేషాలు పెరుగుతాయి. ఎక్కడో కిందనున్న పోలవరం వల్ల పైనుండే తెలంగాణ శాశ్వతంగా ఎడారి అయిపోతుందనడం, పోలవరం ప్రాజెక్టు 150 మీటర్ల ఎత్తున కట్టి తెలంగాణని ముంచుతున్నారని (వాస్తవానికి ఫుల్ రిజర్వాయర్ లెవలే 45.72 మీటర్లు – కేవలం లైవ్ స్టోరేజి 75 టి.యం.సి), తెలంగాణలో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి శ్రీరాంసాగర్ వరకూ వచ్చే నీటి లభ్యత 188 టి.యం.సి.లు ఉంటుందనటం (పదోవంతు కూడా ఉండదు), కోస్తావారు 13 రెట్లు నీరు ఎక్కువ వాడుకుంటారని తెలంగాణ ప్రాంతం సోమాలియా అయిపోతుందని (సోమాలియా కోటి జనాభాతో 3025 కి.మీ సముద్ర తీరం ఉన్న దేశం), విపరీతమైన అవాస్తవ ఆరోపణలు కేవలం ప్రజలను తప్పుదారి పట్టించటానికే. బచావత్ గోదావరి జలవివాదాల ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం మనకు 1495 టి.యం.సి.ల నీటిపై హక్కు లభించింది. మిగులు జలాలు కూడా ప్రస్తుతానికి వాడుకోవచ్చు. గోదావరిలో తెలంగాణ పరివాహక ప్రాంతం 79 శాతం కాగా, కోస్తానే 80 శాతం నీరు వాడుకుంటుందనే కొందరి వాదన అసత్యం. అసలు మొత్తం గోదావరి పరివాహకంలో ఆంధ్రప్రదేశ్ వాటా కేవలం 23.8 శాతం మాత్రమే. పోలవరం వద్ద వచ్చే ప్రవాహం చూస్తే ముఖ్య గోదావరి కంటే ప్రాణహిత, ఇంద్రావతి శబరి (కోలాబ్) ఉప నదుల నుంచి సమకూరే జలాలే దాదాపు 80 శాతం అనీ అవన్నీ గోదావరి ఉత్తర ప్రాంతం నుంచే వస్తున్నాయని, తెలంగాణ జిల్లాల నుంచి సమకూరే నీరు పోలవరం ప్రాజెక్టుకి సాధారణంగా అవసరమే లేదని జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

– చలసాని శ్రీనివాస్

ఆంధ్ర ఇంటలెక్చువల్ ఫోరం